సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
మంగళవారం ׀ 8 ׀ ఆగస్టు ׀ 2023



చేనేతకు అండగా ప్రభుత్వం

చేనేత రంగానికి ప్రభుత్వం అండగా నిలుస్తోందని మహిళా సాధికార సమన్వయకర్త అశ్వినీరెడ్డి అన్నారు. 8లో



సంగ్రామానికి సన్నద్ధం

పంచాయతీల్లో ఖాళీ అయిన సర్పంచ్‌లు, వార్డు మెంబర్ల ఎన్నికకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల అయింది 8లో



భారీగా గంజాయి స్వాధీనం

జిల్లాలో గూడెం కొత్తవీధి, అనంతగిరి మండలాల్లో పోలీసులు భారీ స్థాయిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. 8లో



అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరంలో సీఎం సభకు హాజరైన వరద బాధితులు, పోలవరం నిర్వాసితులు



మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

అండగా ఉంటా.. ఆదుకుంటా..

ఎవరూ అధైర్యపడవద్దు.. మీకు నేను అండగా ఉంటా.. అందరికీ న్యాయం చేయడం నా బాధ్యత
- ఇది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా

మీరే న్యాయం చేస్తారు.. మీరైతేనే న్యాయం చేస్తారు.. రాజన్న బిడ్డపై మాకు అంత నమ్మకం
- ఇది వరద బాధితులు, పోలవరం నిర్వాసితుల విశ్వాసం

- వరద బాధితుల్లో ధైర్యం నింపిన ముఖ్యమంత్రి
- పోలవరం నిర్వాసితులకు గట్టి హామీ
- కూనవరం, వీఆర్‌పురం, చింతూరుల్లో పర్యటన
- నాలుగు గంటలపాటు బాధితులతో గడిపిన వైఎస్ జగన్
- వారి సమస్యలను విని కొండంత భరోసానిచ్చిన సీఎం
- అడుగడుగునా ఆత్మీయ పలకరింపుతో పులకించిన గిరిజనం



బాధితుల మాటలను శ్రద్ధగా ఆలకిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, వేదికపై హోం మంత్రి వనిత, ఎమ్మెల్యేలు ధనలక్ష్మి, భాగ్యలక్ష్మి, కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి, విశాఖపట్నం/చింతూరు: ముఖ్యమంత్రి మాటలు వారిలో కొండంత ధైర్యం నింపాయి. వరదల వల్ల ఏటా మీరు పడుతున్న బాధలను స్వయంగా చూస్తున్నా.. అందుకే లిడార్ సర్వే ద్వారా మరికొన్ని గ్రామాలను ప్రాధాన్యత క్రమంలో చేర్చి పరిహారం అందించేందుకు చర్యలు చేపడుతున్నామని ఆయన చెప్పగానే నిర్వాసితులు హర్షధ్వానాలు చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన విలీన మండలాల ప్రజల్లో ఉత్సాహం నింపింది. ఆయన ప్రసంగం వరద బాధితులతోపాటు పోలవరం నిర్వాసితులకు కొండంత భరోసానిచ్చింది. 'నాన్నగారి హయాంలో రూ 1.15 లక్షల పరిహారం ఇచ్చిన రైతుల భూములకు గతంలో నేను చెప్పినట్లుగా రూ.5 లక్షలు ఇస్తాను.. త్వరలోనే మరో రూ 3.85 లక్షలు రైతులకు అందచేస్తాను' అని సీఎం చెప్పడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. న్యాయం చేసేందుకు మీ బిడ్డ ముఖ్యమంత్రి స్థానంలో కూర్చున్నాడని, మీకు తప్పకుండా బాధల నుంచి విముక్తి కలిగిస్తానని ముఖ్యమంత్రి చెప్పిన మాటలతో నిర్వాసితుల్లో ఆనందం వెల్లివిరిసింది.

అడుగడుగునా ధైర్యం నింపుతూ..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం ఉదయం 10.50 గంటలకు కోతులగుట్ట హెలిప్యాడ్ వద్దకు చేరుకున్నారు. అక్కడ 20 నిమిషాలపాటు వరదలకు సంబంధించిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించి, ప్రజా ప్రతినిధులతో ముచ్చటించారు. 11.15కు హెలిప్యాడ్ వద్ద నుంచి బస్సులో బయలుదేరి 11.40కు కూనవరం బస్టాండు వద్ద ఏర్పాటు చేసిన సభాస్థలికి చేరుకున్నారు. అక్కడ కూనవరం, వి.ఆర్.పురం, చింతూరు, ఎటపాక మండలాలకు చెందిన వరద బాధిత కుటుంబాలను పరామర్శించి సహాయక చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. బాధితుల సమస్యలు విన్నారు. పరిహారం అందరికీ అందిందా.. అని అడిగారు. లేనిపక్షంలో ఇక్కడికి వచ్చి చెప్పండని ఆహ్వానించారు. దీనిపై స్థానికులు తమకు వరద పరిహారం అందిందని బదులిచ్చారు. అయితే ఆర్ అండ్ ఆర్ ప్యాకేజి త్వరగా అందించాలని కోరారు. దీనిపై సీఎం జగన్ స్పందిస్తూ ఇదే విషయాన్ని ఇప్పటికే కేంద్రం దృష్టికి తీసుకువెళ్లానని తెలిపారు. గోదావరి, శబరి నదుల అనుసంధాన ప్రాంతం కావడంతో బ్యాక్ వాటర్ ఎక్కువగా వచ్చి పంటలు మునుగుతున్నాయని, ఏడాదికి ఒక పంట కూడా వేయలేని పరిస్థితి నెలకొంటుందని, దీనిపై తమకు ప్రభుత్వం సాయం అందించాలని బాధితులు కోరారు. పోలవరం ముంపునకు గురయ్యే పంటలకు సొసైటీల ద్వారా రుణాలు ఇప్పించాలన్నారు. సబ్సిడీ మీద రైతులకు ఇచ్చే యంత్రాలు ఇప్పించాలన్నారు. దీనిపై సీఎం స్పందిస్తూ వెంటనే దీనిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను ఆదేశించారు. సభావేదిక వద్ద పలువురి నుంచి వినతులు స్వీకరించారు. ఒక్కో కుటుంబానికి రూ.2 వేల పరిహారంతో పాటు కుటుంబానికి 25 కేజీల ఉచిత బియ్యం ఇచ్చారు. వరదల్లో బాధితుల ఇళ్లకు నష్టం జరిగితే రూ.10 వేల పరిహారం అందిస్తున్నామన్నా రు. వరద బాధిత గ్రామాలను గతంలో ఎప్పుడూ ఇ లా ఆదుకున్నది లేదని బాధితులు మనోగతం వెల్లడించారు. ఏ పూటా లోటు రానివ్వలేదు. ముంపులో ఉన్నా అన్నీ అందించారన్నారు. సీఎం అక్కడ నుంచి మధ్యాహ్నం 1.50 గంటలకు బయలుదేరి హెలిప్యాడ్ వద్దకు చేరుకున్నారు. అక్కడ ప్రజాప్రతినిధులతో ముచ్చటించారు. 3.05కు హెలికాప్టర్‌లో బయలుదేరి ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం గొమ్ముగూడెం వెళ్లారు.



చిన్నారులతో కరచాలనం

భారీ బందోబస్తు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. కోతులగుట్టలోని హెలిప్యాడ్ నుంచి కూనవరంలోని సభాస్థలి వరకు దారి పొడవునా బారికేడ్లు ఏర్పాటు చేశారు. డీఐజీ హరికృష్ణ, ఎస్పీ తుహిన్ సిన్హా బందోబస్తును పర్యవేక్షించారు. అడిషనల్ ఎస్పీ అనిల్‌కుమార్, పార్వతీపురం మన్యం అడిషనల్ ఎస్పీ దిలీప్ కిరణ్, చింతపల్లి అడిషనల్ ఎస్పీ ప్రతాప్ శివకిషోర్, ఏఆర్ అడిషనల్ ఎస్పీ సత్తిరాజు, రంపచోడవరం ఓఎస్డీ మహేశ్వరరెడ్డి, ఏఎస్పీలు రాహుల్ మీనా, సునీల్‌సారేన్, జగదీష్ అడహళ్లి బందోబస్తులో పాల్గొన్నారు. 674 మంది సివిల్ పోలీసులు, సీఆర్పీఎఫ్ బలగాలు బందోబస్తు నిర్వహించాయి.

ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

సాక్షి, పాడేరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి సోమవారం కూనవరం మండలం కోతులగుట్ట హెలిప్యాడ్ వద్ద ఘన స్వాగతం లభించింది. కలెక్టర్ సుమిత్‌కుమార్, రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు, జిల్లా పార్టీ అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, ఇతర ప్రజాప్రతినిధులు, నేతలు ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఆయనతోపాటు హెలికాప్టర్ దిగిన హోంశాఖ మంత్రి తానేటి వనితకు కూడా ఎమ్మెల్యేలు స్వాగతం పలికారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డికి రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి భద్రాచలం సీతారాముల ఇత్తడి ప్రతిమను అందజేశారు.



నేనున్నాను : భరోసా ఇస్తున్న సీఎం జగన్



చల్లగా ఉండు : అవ్వ దీవెన

కలెక్టర్ బాగా పనిచేశారు

గతేడాది, ఈ ఏడాది వచ్చిన వరదల సమయంలో జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఎంతో బాగా పనిచేశారు సార్.. మేము ఇక్కడి నుంచి వెళ్లే వరకు కలెక్టర్ గారు ఈ జిల్లాలోనే ఉండేలా చూడండి సార్.. అంటూ వరద బాధితులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తో అన్నారు. 'వరదలు అడ్డంకిగా ఉన్నందున కలెక్టర్ గారు మా ఊరికి రాలేదు సార్' అని వీఆర్‌పురం మండలం అడవి వెంకన్నగూడేనికి చెందిన మహిళ చెప్పగానే.. వరదలు తగ్గాయి కదా కలెక్టర్ గారూ.. ఒకసారి ఆ ఊరు వెళ్లి రండంటూ ముఖ్యమంత్రి సూచించారు. ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు వరదల సమయంలో ముందస్తుగా చర్యలు చేపట్టారని, సహాయక చర్యలు ముమ్మరంగా జరిగేలా చూశారని వరద బాధితులు సీఎంకు వివరించారు. తన తల్లి ఆరోగ్యం సరిగా లేకున్నందున సీఎంవో కార్యాలయానికి వస్తే సీఎం సహాయ నిధి నుంచి రూ.2 లక్షల ఆర్థికసాయం అందివ్వడంతో వైద్యం చేయించగలిగానని కూనవరం మండలం చినార్కూరుకు చెందిన సున్నం అభిరాం సీఎం కృతజ్ఞతలు తెలిపాడు.

ఎస్‌ఐని భుజం తట్టి అభినందించిన సీఎం

గత ఏడాది, ఈఏడాది వచ్చిన గోదావరి వరదల్లో సాహసోపేతంగా రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించిన కూనవరం ఎస్‌ఐ బి.వెంకటేష్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందించారు. హెలిప్యాడ్ నుంచి కూనవరంలో వరద బాధితులతో ఏర్పాటు చేసిన సభకు హాజరవుతున్న సందర్భంలో ఒక విజ్ఞాపన కోసం సీఎం బస్సుదిగారు. అదే సమయంలో అక్కడున్న స్థానికులు అధికారులు ఎస్‌ఐ బాగా పనిచేశారని సీఎంకు చెప్పారు. ఎస్‌ఐ వెంకటేష్ రెస్క్యూ ఆపరేషన్ సాహసంగా నిర్వహించారని, గత ఏడాది భీకరంగా వచ్చిన గోదావరి వరదల్లో కూనవరం సమీపంలోని దాదాపు నాలుగు వేల నుంచి ఐదు వేలమంది గ్రామస్తులను తరలించడంలో కీలకపాత్ర పోషించారని సీఎం ఎదుట పలువురు మెచ్చుకున్నారు. అదే సమయంలో అక్కడే విధులు నిర్వహిస్తున్న వెంకటేష్‌ను సీఎం భుజం తట్టి అభినందించారు. మెడల్ ఇవ్వాలని సిఫార్సు చేశారు.



కష్టకాలంలో చేయూత

సీఎంతో వరదబాధితుల ముఖాముఖి

కూనవరం/వీఆర్‌పురం: గోదావరి వరదల్లో జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, చింతూరు డివిజన్ అధికార యంత్రాంగం పదిరోజులపాటు ముంపు ప్రాంతాల్లోనే ఉంటూ సహాయ సహకారాలు అందించారని, వారి సేవలు మరువలేనివని పలువురు బాధితులు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డితో జరిగిన ముఖాముఖిలో పలువురు మాట్లాడారు. కష్టకాలంలో ప్రభుత్వపరంగా సాయం అందించి ఆదుకున్నారని వారు పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ఎంతగానో ఉపయోగపడ్డాయన్నారు.

వరదకు ముందే తరలింపు



గతంలో ఆకస్మికంగా సంభవించిన గోదావరి వరదలకు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నాం. ఈ ఏడాది గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని అధికారయంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టింది. కలెక్టర్, చింతూరు ఐటీడీఏ పీవో లోతట్టు ప్రాంతాల నుంచి పునరావాస ప్రాంతాలకు తరలించి బియ్యం, కూరగాయలు, నిత్యావసర సరకులు, టార్పాలిన్లు అందించారు. - కట్టం లక్ష్మి, కొండ్రాజుపేట పంచాయతీ, శబరి కొత్తగూడెం

నవరత్నాలు ఆదుకున్నాయి



ప్రతీ ఏటా జూన్, జూలై నెలల్లో సంభవించే వరదల వల్ల అనేక విధాలుగా నష్టపోతున్నాం. ఈ పరిస్థితుల్లో నవరత్నాల పథకాలు ఎంతగానో తమను ఆదుకున్నాయి. పనులు లేక ఇబ్బందులు పడుతున్న కష్టకాలంలో ఆర్థికంగా ఆదుకున్నాయి. ప్రాధాన్యత ఉన్న గ్రామాలకు ఆర్‌అండ్‌ఆర్ ఇచ్చి పంపించాలి.
- కొమ్మాని సునీత, కూనవరం

గోకవరం వద్దే పునరావాసం కల్పించాలి



మా గ్రామానికి ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం తాడ్వాయిలో పునరావాస కాలనీ నిర్మిస్తామని అధికారులు చెప్పారు. నిత్యం కూలిపనులకు వెళ్లి జీవనం సాగిస్తున్న మాకు అక్కడ పని దొరికే పరిస్థితి లేనందున గోకవరం మండలంలో పునరావాసం కల్పించాలని కోరుకుంటున్నాం. ప్రభుత్వం ఈ దిశగా ఆలోచించాలి.
- వద్దానపు రజని, చింతరేగుపల్లి, వీఆర్‌పురం మండలం

ఏడుగురాళ్లపల్లి రహదారి నిర్మించాలి



వరదల సమయంలో అత్యవసర సేవలు అందించేందుకు అనువుగా ఉన్న కోతులగుట్ట–ఏడుగురాళ్లపల్లి రహదారిని నిర్మించాలి. వీఆర్‌పురం మండలంలోని అన్నవరం–పెదమట్టపల్లి మీదుగా తులసిపాక వరకు ఉన్న రహదారిని కూడా నిర్మిస్తే వరదల సమయంలో చాలా వరకు రోడ్డు కనెక్టివిటీ ఏర్పడుతుంది.
- ఉండవల్లి గాంధీబాబు, రేఖపల్లి, వీఆర్‌పురం మండలం

ఆర్ అండ్ ఆర్ సభలు వేగవంతం



ముంపు గ్రామాల్లో అధికారులు ఆర్‌అండ్‌ఆర్ గ్రామ సభలను వేగంగా నిర్వహిస్తున్నారు. త్వరితగతిన స్ట్రక్చర్ వాల్యూ, ఆర్‌అండ్‌ఆర్ అందించాలి. అధికారులు, ప్రభుత్వం ఈదిశగా చర్యలు చేపడితే వరద బాధితులు సమస్యలు పరిష్కారమవుతాయి. దీనిపై దృష్టి పెట్టమని సీఎంను కోరుతున్నాం.
- పిట్టా రామారావు, సర్పంచ్ చినమట్టపల్లి

ఎన్నడూ లేని విధంగా నిత్యావసరాల పంపిణీ



ఎన్నడూలేనివిధంగా ఈ ఏడాది నిత్యావసర సరకులను ప్రభుత్వం అందించింది. ముంపుతో సంబంధం లేకుండా ప్రతీ కుటుంబానికి కలెక్టర్ ,మండల స్థాయి అధికారులు రూ.2 వేలు తక్షణ సహాయం అందించారు. అలాగే వరద ముంపు కారణంగా దెబ్బతిన్న ఇళ్లకు పరిహారమివ్వడం ఎంతో సంతోషంగా ఉంది.
- సున్నం అభిరామ్, సర్పంచ్ చినార్కూరు, కూనవరం మండలం

కాంటూరుతో సంబంధం లేకుండా పరిహారం



పోలవరం ముంపు బాధితులకు కాంటూరుతో సంబంధం లేకుండా పరిహారం ఇప్పిస్తే అన్ని గ్రామాల్లోని ప్రజలకు ఊరట లభిస్తుంది. గతంలో వచ్చిన వరదలకు మునిగిన గ్రామాలు అన్నింటికీ పరిహారం ఇవ్వాలి. తాము చాన్నాళ్లుగా ఇదే కోరుకుంటున్నాం. ఈ దిశగా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.
- కారం పార్వతి, సర్పంచ్ జగ్గవరం, కూనవరం మండలం

అదనపు పరిహారం ఇవ్వాలి



గతంలో పోలవరం భూ పరిహారం కింద దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఐదు ఎకరాలు మినహాయించి ఆపైఉన్న భూములకు రూ.1.15 లక్షలు ఇచ్చారు. వీటికి అదనంగా చెల్లిస్తామన్న రూ.3.85 లక్షల పరిహారాన్ని ఐదు ఎకరాల లోపు భూములు కలిగిన గిరిజన రైతులకు కూడా చెల్లించాలని కోరుతున్నాం
- కుంజా శ్రీను, శబరికొత్తగుడెం ,కూనవరం మండలం

మా గ్రామాన్ని పోలవరం ముంపు సర్వేలో చేర్చాలి



మాగ్రామం చుట్టుపక్కల ఉన్న గ్రామాల్లో ఆర్‌అండ్‌ఆర్ గ్రామ సభలు నిర్వహిస్తున్నారు. అయితే మా గ్రామాన్ని మినహాయించారు. వెంకన్నగూడెంను కూడా ముంపు గ్రామంగా ప్రకటించి సర్వే చేయించాలి. ఈ దిశగా చర్యలు చేపట్టి ఆదుకోవాలి.
- కారం కన్నమ్మ, వెంకన్నగూడెం,కూనవరం మండలం

9న ఐటీడీఏ ఆధ్వర్యంలో ఆదివాసీ దినోత్సవం

- మోదకొండమ్మ అమ్మవారికి పట్టు వస్త్రాలు
- ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు రూరల్: పాడేరు ఐటీడీఏ ఆధ్వర్యంలో పట్టణంలోని వీఆర్ కల్యాణ మండపంలో ఈనెల 9వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించనున్నట్టు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా గిరిజనుల ఆరాధ్య దైవం మోదకొండమ్మ అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పిస్తామన్నారు. అతిథుల సందేశం, గిరిజన పెద్దలకు సన్మానం, గిరిజన లబ్ధిదారులకు పరికరాల పంపిణీ , సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఐటీడీఏ పరిధిలోని ఆదివాసీ ప్రజాప్రతినిధులు, ఆదివాసీ పెద్దలు, ఆదివాసీ సంఘాలు, సంస్థలు, గిరిజన ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులను ప్రత్యేకంగా ఆహ్వానిస్తున్నామని చెప్పారు.ఈ కార్యక్రమం విజయవంతానికి అందరూ సహకరించాలని ఐటీడీఏ పీవో అభిషేక్ కోరారు.

త్వరితగతిన 'నాడు నేడు' పనులు

డీఐఈవో అప్పలరాము



ముంచంగిపుట్టు కళాశాలలో పనులను పరిశీలిస్తున్న డీఐఈవో అప్పలరాము

ముంచంగిపుట్టు: త్వరితగతిన నాడు–నేడు పనులు పూర్తి చేయాలని జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి అప్పలరాము ఆదేశించారు.స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాలలో నాడు–నేడు పథకం కింద రూ.98,83,788 వ్యయంతో జరుగుతున్న పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యత తగ్గకుండా చూడాలని, బాలికల మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రాధాన్యం ఇచ్చి, వేగంగా పూర్తి చేయాలని కళాశాల ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. ఇక్కడ జరుగుతున్న పనుల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.అనంతరం తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు.పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. ఆంగ్ల భాషలో విద్యార్థులు తడబడడంతో ఆయన అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థులకు అన్ని భాషలపై పట్టు ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థుల నోట్ పుస్తకాలను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రావణ్‌కుమార్, అధ్యాపకులు వేణుగోపాలరావు,దామోదరం, లక్ష్మణకుమార్,కోటిబాబు,సూకరాజు పాల్గొన్నారు.

ఎంపీ మాధవి సోదరుడు మహేష్‌కు గాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహేష్

చింతపల్లిరూరల్: జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు,ఎంపీ మాధవి సోదరుడు గొడ్డేటి మహేష్ సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. మండలంలో ఎర్రబొమ్మల పంచాయతీ కొండవంచుల గ్రామంలో తన బంధుమిత్రులను కలిసేందుకు కొయ్యూరు మండలం శరభన్నపాలెం నుంచి తన ద్విచక్ర వాహనంపై వెళ్లారు.తిరుగు ప్రయాణంలో కొండవంచుల సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తా పడింది.ఈ ప్రమాదంలో మహేష్‌కు తీవ్ర గాయాలవడంతో అపస్మారక స్థితికి చేరుకున్నారు. వెంటనే బంధువులు సర్పీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు.అక్కడ నుంచి విశాఖపట్నం తరలించారు.సమాచారం తెలుసుకున్న ఎంపీ మాధవి ఆందోళన చెందారు.ఆమె ఢిల్లీలో ఉన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ఐసీడీఎస్ ఉత్తరాంధ్ర జిల్లాల రీజినల్ జాయింట్ డైరెక్టర్ చిన్మయి దేవి



ఒడియావలస అంగన్‌వాడీ కేంద్రం పరిశీలిస్తున్న చిన్మయి దేవి

దుంబ్రిగుడ/హుకుంపేట: అంగన్‌వాడీ కార్యకర్తలు, ఐసీడీఎస్ అధికారులు విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఉత్తరాంధ్ర జిల్లాల ఐసీడీఎస్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ జి.చిన్మయి దేవి హెచ్చరించారు. దుంబ్రిగుడ మండలంలో మారుమూల పంచాయతీ సొవ్వను సోమవారం ఆమె సందర్శించారు. అనంతరం ఒడియావలస, సాగర పంచాయతీ కిల్లోగుడ అంగన్‌వాడీ కేంద్రాలను, హుకుంపేట మండలం దాలిగుమ్మడి అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. పౌష్టికాహారాన్ని తనిఖీ చేసి, పథకం అమలు తీరుపై గర్భిణులు, బాలింతలను ఆరా తీశారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న పోషకాహారం పక్కాగా అందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పౌష్టికాహారాన్ని గర్భిణులు బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. స్వయంగా అటవీ ప్రాంతంలో ఉన్న సిగ్నల్ పాయింట్ వద్దకు వెళ్లి ఆన్‌లైన్ నమోదును పరిశీలించారు. ఈ కార్యక్రమాల్లో నోడల్ ఆఫీసర్ కుమారి, సూపరింటెండెంట్ మూర్తి, ఐసీడీఎస్ సీడీపీవోలు నీలిమ,బాలచంద్రమణి దేవి, సూపర్‌వైజర్లు ,అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా' లోగో, మస్కట్ తయారీ పోటీలు

పాడేరు రూరల్ : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో అక్టోబర్ 2న 'ఆడుదాం ఆంధ్రా' క్రీడల పోటీలు నిర్వహించనున్నట్టు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకులు ఎ.జగన్మోహన్‌రావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వాలీబాల్, క్రికెట్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తామన్నారు. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ఐదు దశల్లో పోటీలుంటాయని తెలిపారు.ఈ క్రీడలకు సంబంధించి లోగో, మస్కట్ డిజైన్ కోసం రాష్ట్రప్రభుత్వం పోటీలను నిర్వహించనున్నట్టు తెలిపారు. ఇందులో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతిగా రూ.5వేలు, ద్వితీయ బహుమతిగా రూ.3వేలు, తృతీయ బహుమతిగా రూ.2వేల నగదు అందజేస్తామన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే వారు ఈనెల9వ తేదీ సాయంత్రం 5గంటల లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

పట్టపగలే చోరీ

26 కాసుల బంగారం అపహరణ

దేవీపట్నం : ఇందుకూరుపేటలో సోమవారం తాళం వేసి ఉన్న ఒక ఇల్లు చోరీకి గురైంది. వివరాల్లోకి వెళ్తే పై గ్రామానికి చెందిన మేడపాటి సత్యనారాయణ తన భార్య అనారోగ్యానికి గురవడంతో ఇంటికి తాళం వేసి రాజమండ్రి ఆసుపత్రికి వెళ్లారు. సోమవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలో గల 26 కాసుల బంగారం, రూ.15 వేలు నగదు అపహరించుకుపోయారు. దేవీపట్నం స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

నాయకులతో మాటామంతీ

చింతూరు: కూనవరం పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హెలీప్యాడ్ వద్ద నాలుగు మండలాలకు చెందిన స్థానిక ప్రజా ప్రతినిధులతో మాట్లాడారు. రంపచోడవరాన్ని ప్రత్యేక జిల్లా చేయాలని, వరదముంపునకు గురవుతున్న గ్రామాలను తొలిదశలో చేర్చి పరిహారం అందించాలని పలువురు ప్రజాప్రతినిధులు ఆయనను కోరారు. వరదల సమయంలో అనువుగా ఉండేలా ప్రత్యామ్నాయ రహదారులు నిర్మించాలని, నాలుగు మండలాల్లో పూర్తిస్థాయిలో అధికారులను నియమించాలని వారు సీఎంను కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ కమిషన్ సభ్యుడు చిచ్చడి మురళి, చింతూరు ఎంపీపీ సవలం అమల, వైస్ ఎంపీపీ మేడేపల్లి సుధాకర్, కోఆప్షన్ సభ్యుడు ఎండీ అక్బర్ అలీ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామలింగారెడ్డి, కోట్ల కృష్ణ, కూనవరం జెడ్పీటీసీ గుజ్జా విజయ, ఎంపీపీ పాయం రంగమ్మ, జేసీఎస్ మండల ఇన్‌చార్జి ఆవుల మరియాదాసు, మండల కన్వీనర్ అయిలూరి కోటేశ్వరరావు, ఎటపాక జెడ్పీటీసీ ఉబ్బా సుస్మిత, ఎంపీపీ కాక కామేశ్వరి, మండల కన్వీనర్ తానికొండ వాసు, చింతపల్లి, కొయ్యూరు ఎంపీపీలు కోరాబు అనూషాదేవి, బడుగు రమేష్, జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య పడాల్ పాల్గొన్నారు.

అప్పన్న హుండీ ఆదాయం రూ.1.7 కోట్లు


పరిశీలిస్తున్న ఈవో త్రినాథరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి హుండీ ఆదాయం గడిచిన 34 రోజులకు గాను కోటి 70 లక్షల 55వేల 730 రూపాయలు వచ్చినట్టు ఈవో వి.త్రినాథరావు తెలిపారు. సింహగిరిపై స్వామివారి ఆలయ బేడామండపంలో సోమవారం హుండీల ఆదాయాన్ని లెక్కించారు. నగదుతో పాటు 112.005 గ్రాముల బంగారం, 10.050 కిలోల వెండి లభించినట్టు ఈవో పేర్కొన్నారు. సోమవారం 11 హుండీలను మాత్రమే తెరిచి లెక్కించడం జరిగిందని, మంగళవారం కూడా లెక్కింపు ఉంటుందని పేర్కొన్నారు. ఈ లెక్కింపులో దేవస్థానం అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సేవా సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి
టెండరు ప్రకటన
Roc.No.TTD-47022(32)/22/2022 Revenue Sec-TTD
ఒకటి (01) సంవత్సర కాల వ్యవధి కోసం రుషికొండ, విశాఖపట్నంలో ఫుట్ హిల్ వద్ద పార్కింగ్ ప్లేస్ లైసెన్సింగ్ కోసం 30.08.2023న టెండర్లు కోరబడుచున్నవి. తదుపరి వివరాల కోసం సంప్రదించు ఫోన్ నంబరు: 0877-2264246, 9866868496. వివరాల కోసం వెబ్‌సైట్ http://www.tirumala.org కి లాగాన్ కండి.
Roc No: PR4/13957/Adv.No.148/PRO/2023, Dt: 07.08.2023
ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్

వరద సహాయక కార్యక్రమాలపై సీఎం సంతృప్తి


సీఎం వైఎస్ జగన్ రాకను సెల్‌ఫోన్లలో చిత్రీకరిస్తున్న గిరిజనులు


ముఖ్యమంత్రికి ఆత్మీయ స్వాగతం

సాక్షి, పాడేరు: ముంపు గ్రామాల్లో ప్రభుత్వ సహాయక సేవా కార్యక్రమాలను విజయవంతంగా చేపట్టిన జిల్లా అధికార యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందించారు. కోతుల గుట్ట ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఫొటోఎగ్జిబిషన్‌ను ఆయన పరిశీలించారు. చింతూరు, పోలవరం, వీఆర్ పురం, ఎటపాక గోదావరి శబరినదుల్లో వరద ఉధృతికి గురైన గ్రామాల సమగ్ర వివరాలతో రూపొందించిన మ్యాప్‌లను సీఎం పరిశీలించారు. వాటి వివరాలను ఆయనకు కలెక్టర్ సుమిత్‌కుమార్ వివరించారు.

అలాగే ముంపు గ్రామాల్లో ప్రభుత్వ యంత్రాంగం చేపట్టిన సహాయక కార్యక్రమాలతో ఏర్పాటుచేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. హోంశాఖ మంత్రి తానేటి వనిత, రంపచోడవరం, పాడేరు ఎమ్మెల్యేలు నాగులపల్లి ధనలక్ష్మి, కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు తదితరులు పాల్గొన్నారు.


ఫొటో ఎగ్జిబిషన్‌లో చిత్రాల ద్వారా ముఖ్యమంత్రికి వరద నష్టాన్ని వివరిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్


వరద ముంపు ప్రాంత బాధితులతో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్

భారీగా గంజాయి స్వాధీనం


గంజాయి, నిందితులతో అనంతగిరి పోలీసులు

గూడెంకొత్తవీధి : ఒరిస్సా ప్రాంతం నుంచి అల్లూరి జిల్లా మీదుగా కర్ణాటక రాష్ట్రానికి గంజాయి తరలిస్తున్న 10 మందిని అరెస్టు చేసి కేసు నమోదు చేశామని జీకేవీధి సీఐ అశోక్ కుమార్ తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఒరిస్సా రాష్ట్రం చిత్రకొండ బ్లాక్ జీడిపాకలు గ్రామంలో కొంత కాలంగా కొందరు గంజాయి కొనుగోలు చేసి రవాణా చేస్తున్నారని తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని పాత వీధి వద్ద పోలీసు బృందాలు వాహన తనిఖీలు చేపడుతుండగా రెండు ఆటోలలో 12 ప్లాస్టిక్ సంచులతో 255 కిలోల గంజాయితో నిందితులు పట్టుబడినట్టు తెలిపారు. వారిని విచారించగా బెంగళూరు ప్రాంతానికి చెందిన మారప్ప (22), చింతపల్లి మండలం పెండ్లిమామిడి గ్రామానికి చెందిన కోర్ర అప్పారావు (22), గెమ్మిలి యువరాజు (23), పాంగి సుఖదేవ్ (27), రారింతాడ గ్రామానికి చెందిన కోర్ర సందీప్(22), కోర్ర బుజ్జిబాబు(26), కోర్ర రమేష్ (27)చవటపాడు గ్రామానికి చెందిన అప్పలస్వామి(19)గా గుర్తించి వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామన్నారు. వారితో మరో ఇద్దరు జువెనీల్స్ (17 సంవత్సరాలు లోపు ఉన్నవారు)పెండ్లిమామిడి గ్రామానికి చెందిన గెమ్మిలి కిరణ్(17), వంతల ఉదయ్(17)పై కూడా కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచామన్నారు. నిందితుల వద్ద నుంచి సుమారు రూ.25 లక్షలు విలువ చేసే గంజాయితో పాటు లక్ష నాలుగు వేల రూపాయల నగదు, 5 సెల్‌ఫోన్లు, రెండు ఆటోలు, రెండు బైకులు స్వాధీనం చేసుకున్నామన్నారు. మరో నలుగురు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలిస్తున్నామని సీఐ తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ వాసు, కిరణ్, బాల సిబ్బంది పాల్గొన్నారు.

280 కిలోల గంజాయి పట్టివేత

అనంతగిరి : అరకు నుంచి మైదాన ప్రాంతానికి తరలిస్తున్న బొలేరో పికప్ వాహనంలోని తరలిస్తున్న 280 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని, ఐదుగురిని అరెస్ట్ చేశామని అనంతగిరి ఎస్ఐ కరక రాము సోమవారం తెలిపారు. మండలంలోని జూనియర్ కళాశాల వద్ద వాహన తనిఖీలు చేపడుతుండగా, అరకు నుంచి మైదాన ప్రాంతానికి వెళ్తున్న బొలేరో పికప్ వాహనంలో 280 కిలోల గంజాయి బయటపడిందని తెలిపారు.

కర్ణాటక రాష్ట్రం హోరండికి చెందిన అక్షయ్ కుమార్, శభం సుభాష్‌కాంబ్లేతో పాటుగా ఒడిస్సా రాష్ట్రం పాడువకు చెందిన పాంగి ఉదయ్, బొలేరో పికప్ వాహనం ముందుగా ద్విచక్రవాహనంపై పైలెట్‌గా వ్యవహరించిన పాడువకు చెందిన పాంగి తెర్ల, అల్లూరి జిల్లా హుకుంపేట మండలం గన్నేరుపుట్టుకు చెందిన వంతల రాజ్‌కుమార్‌తో కలిపి ఐదుగురిని అరెస్ట్ చేశామన్నారు. గంజాయితో పాటుగా బోలేరో పికప్, బైక్‌ను స్వాధీనం చేసుకుని, నిందితులను కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారని ఎస్ఐ తెలిపారు.

కలెక్టరేట్‌లో ఉచిత వైద్య శిబిరం


వైద్య శిబిరంలో పేర్లు నమోదు చేసుకుంటున్న ఉద్యోగులు


ఉచితంగా మందులు అందజేస్తున్న గాయత్రీ ఆస్పత్రి సిబ్బంది

111 మందికి వైద్య పరీక్షలు

పాడేరు రూరల్ : పాడేరు జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రత్యేక చొరవ తీసుకొని విశాఖపట్నం గాయత్రీ విద్యా పరిషత్ ఆస్పత్రి, జి-ట్రైబల్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. కలెక్టరేట్ కార్యాలయంలోని వివిధ విభాగాల్లో పని చేస్తున్న 111 మంది ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. బీపీ, షుగర్, ఈసీజీ, కంటి పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు అందజేశారు. గాయత్రీ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ జనరల్ సర్జన్ డాక్టర్ ఎ. రంగారావు, జనరల్ మెడిసిన్ డాక్టర్ వి.ధర్మారావు, గుండె, క్షయ వ్యాధి నిపుణులు డాక్టర్ సి. రాఘవేంద్ర తదితరులతో కూడిన వైద్య బృందం వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ డాక్టర్ కె.ఎ స్.బోస్, డాక్టర్ సాయిరూప్, డాక్టర్ జి.సూర్యప్రకాష్, డాక్టర్ లక్ష్మీనారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చేనేతకు అండగా ప్రభుత్వం

పాడేరు రూరల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ చేనేత దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మహిళ సాధికార సమన్వయకర్త అశ్విని రెడ్డి మాట్లాడుతూ చేనేత కార్మికులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. చేనేత పరిశ్రమలు సంస్కృతి, సంప్రదాయాలకు చిహ్నాలన్నారు. రాష్ట్రంలో తయారైన చేనేత, జనతా, ఖద్దర్ వస్త్రాలు దేశ ఆచార సంస్కృతి, సంప్రదాయలను ఇతర దేశాలకు చాటి చెబుతోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత కార్మికుల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టాయన్నారు. అనంతరం కళాశాల విద్యార్థులకు చేనేత, ఆప్కో వస్త్రాలపై అవగాహన కల్పించారు. వైస్ ప్రిన్సిపాల్ టి.ఎస్.రసూల్, అధ్యాపకులు శంకర్‌రావు, అచ్యుత్, కోటేశ్వరరావు, లావణ్య, జీవన జ్యోతి, హిమబిందు, ఎస్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ గౌరీశంకర్‌రావు, పి.రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

లైంగిక దాడి కేసులో రెండేళ్ల జైలు

విశాఖ లీగల్/పాడేరు రూరల్: యువతిపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.పది వేల జరిమానా విధిస్తూ నగరంలోని పోక్సో నేరాల ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి జి.ఆనంది సోమవారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని యెడల అదనంగా 15 రోజుల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని ఆ తీర్పులో పేర్కొన్నారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కరణం కృష్ణ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నిందితుడు బొమ్మిడి మహాలక్ష్మి అలియాస్ రాజు (24) కాకినాడ నివాసి. గతంలో ఒంగోలులోని ఒక ప్రైవేట్ సంస్థలో పనిచేసేవాడు. తరువాత పాడేరు వచ్చి నివాసం ఏర్పర్చుకున్నాడు. డ్రైవర్‌గా పనిచేసేవాడు. బాధితురాలు(17) అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం చుక్కల వీధి గ్రామ పరిధిలోని శివాలయం వీధిలో ఉండేది. హుకుంపేట మండలం గుత్తులపాడు హైస్కూలులో పదో తరగతి చదివేది. తరచూ అదే ప్రాంతంలో ఉండే మహాలక్ష్మితో పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం ప్రేమగా మారింది. దీంతో ఇద్దరూ 2021 జూన్ రెండో తేదీన పాడేరు బస్టాండ్ నుంచి చిలకలూరిపేటకు వెళ్లారు. అక్కడ ఇద్దరూ ఉన్నారు. నిందితుడు మాయ మాటలు చెప్పి ఆమెను లోబర్చుకున్నాడు. అనంతరం వేరే ప్రాంతంలో వదిలి వెళ్లిపోయాడు. దిక్కులేని స్థితిలో పాడేరు చేరుకున్న బాధితురాలు హుకుంపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. పాడేరు ఎస్ఐలు జి.లక్ష్మణరావు, ఎం.శ్రీనివాసులు కేసు నమోదు చేశారు. అప్పటి ఏఎస్పీ తుషార్ కేసు దర్యాప్తు చేసి నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పునిచ్చారు.

సంగ్రామానికి సన్నద్ధం

ముంచంగిపుట్టు/రాజవొమ్మంగి/పెదబయలు/చింతపల్లి/జి.మాడుగుల/అడ్డతీగల: పంచాయతీల్లో వివిధ కారణాలతో ఖాళీ అయిన సర్పంచ్‌లు, వార్డు మెంబర్ల ఎన్నికకు సంబంధించి నోఫికేషన్ విడుదల కావడంతో ఆయా గ్రామాల్లో ఎన్నికల సందడి మొదలైంది. బరిలో నిలిచేందుకు పలువురు అభ్యర్థులు ప్రయత్నాలు ప్రారంభించారు. ఈనెల 8 నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. 10వ తేదీలోగా నామినేన్లు దాఖలు చేయాలి. 11న పరిశీలన, 12న తిరస్కరణ, 14న అభ్యర్థుల జాబితా ప్రదర్శించనున్నారు. 19న ఎన్నికలు నిర్వహించి, అదే రోజు ఫలితాలు ప్రకటించనున్నారు.

- ముంచంగిపుట్టు మండలంలో 12 వార్డు స్థానాలకు ఎన్నికలు జరగనున్నట్టు ఎంపీడీవో ఆర్.వి.ఎస్.రమేష్ సోమవారం తెలిపారు. లక్ష్మీపురం పంచాయతీలో 2వ వార్డుకు, కుమడ పంచాయతీలో 1,4,8 వార్డులకు, భూసిపుట్టు పంచాయతీలో 1,2,3,5,6,7,9,10 వార్డుల సభ్యుల పదవులకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది.
- రాజవొమ్మంగి మండలం లోదొడ్డి పంచాయతీలోని 6వ వార్డు సభ్యుడి ఎన్నికకు నోటిఫికేషన్ విడుదలైనట్టు ఎంపీడీవో యాదగిరీశ్వరరావు తెలిపారు.
- పెదబయలు మండలం పెదకోడాపల్లి సర్పంచ్ పదవితో పాటు ఇంజరి పంచాయతీలో 1వ వార్డు (ఎస్టీ మహిళ), 4వ వార్డు (ఎస్టీ మహిళ), 5వ వార్డు (ఎస్టీ మహిళ), 8వ వార్డు (ఎస్టీ మహిళ), 9వ వార్డు (ఎస్టీ మహిళ),10వ వార్డు (ఎస్టీ మహిళ),11వ వార్డు (ఎస్టీ జనరల్),12వ వార్డు (ఎస్టీ మహిళ) సభ్యుల పదవులకు ఎన్నికలు జరగనున్నట్టు స్థానిక ఎంపీడీవో ఎల్. పూర్ణయ్య తెలిపారు.
- చింతపల్లి మండలంలోని చింతపల్లిలో 4వ వార్డు,కుడుంసారి పంచాయతీలో 9వ వార్డు సభ్యుల పదువులకు ఎన్నికలు జరగనున్నట్టు ఎంపీడీవో ఆశాజ్యోతి తెలిపారు.
- జి.మాడుగుల మండలంలో బొయితిలి, గెమ్మెలి పంచాయతీల్లో రెండు వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో చంద్రశేఖర్‌రావు తెలిపారు. బొయితిలి పంచాయతీలో 1వార్డుకు, గెమ్మెలి పంచాయతీలో 2వార్డుకు ఎన్నికలు జరగునున్నాయని ఆయన చెప్పారు.
- అడ్డతీగల మండలంలోని దొరమామిడి పంచాయతీలో ఐదవ వార్డు,భీముడుపాకలు పంచాయతీలో 8వ వార్డు సభ్యుల పదవులకు ఎన్నికలు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో బాపన్నదొర తెలిపారు.

కొయ్యూరులో విషాదం

- బిడ్డకు జన్మనిచ్చిన నాలుగో రోజున తల్లి మృతి
- ఫిట్స్ రావడంతో బాలింత కేజీహెచ్‌లో మృతి
- ఆరోగ్యంగా ఉన్న బిడ్డ


శిరీష (ఫైల్)

కొయ్యూరు : కొయ్యూరులో విషాదం చోటు చేసుకుంది. బిడ్డకు జన్మ ఇచ్చిన నాలుగో రోజున బాలింత మరణించింది. సిరిబాల శిరీష(21)కు ఈ నెల 3 తేదీన పురిటి నొప్పులు రావడంతో ఆమెను రాజేంద్రపాలెం ఆస్పత్రిలో చేర్చారు. అయితే ఆమె ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో అక్కడి నర్సీపట్నం, అక్కడ నుంచి కేజీహెచ్‌కు తరలించారు. ఈ నెల 3న శిరీష ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. అయితే ఆమెకు ఇది మొదటి కాన్పు కావడంతో ప్రసవం కష్టంగా మారడంతో సిజేరియన్ చేశారు. బిడ్డకు జన్మనిచ్చిన నాటి నుంచి ఆమె ఆరోగ్యం క్షీణించ సాగింది. ఆదివారం సాయంత్రం ఉన్నట్టుండి ఫిట్స్ రావడంతో ఆమె మృతి చెందింది. బిడ్డ క్షేమంగా ఉన్నా తల్లి మరణించడంతో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. శిరీష అంత్యక్రియలు సోమవారం నిర్వహించారు.

వీరచక్రదొరకు అభినందనలు

ఆర్ ఎస్ఐగా ఎంపికైన వ్యవసాయ కూలి కుమారుడు


వీరచక్రదొర

రాజవొమ్మంగి: ఇటీవల తెలంగాణాలో జరిగిన పోలీస్ సెలక్షన్స్‌లో రాజవొమ్మంగి మండలం దూసరపాము గ్రామానికి చెందిన పోతంశెట్టి వీరచక్రదొర ఏఆర్ ఎస్ఐగా ఎంపికైనట్టు సోమవారం ఫలితాల్లో వెల్లడైంది. తండ్రి నిరుపేద వ్యవసాయ కూలీ కాగా అన్న తాపీ మేస్త్రీ. తండ్రి, అన్నయ్యలు సంపాదించిన కూలీ సొమ్ముతోనే కష్టపడి చదివిన వీరచక్రదొర పోలీస్‌సెలక్షన్స్‌లో విజయం సాధించడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.పేద కుటుంబానికి చెందిన వీరచక్రదొర పోలీస్ సెలెక్షన్స్‌లో విజయం సాధించడంతో కుటుంబసభ్యులతో పాటు బంధువులు, స్నేహితులు ఆనందం వ్యక్తం చేశారు.

ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మహారాణిపేట: ఓపెన్ స్కూల్ ద్వారా టెన్త్, ఇంటర్మీడియెట్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణలో దూర విద్యా విధానం పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆగస్టు 31వ తేదీ నాటికి 14 సంవత్సరాల వయస్సు నిండిన వారందరూ పదో తరగతిలో ప్రవేశానికి అర్హులన్నారు. ఏపీ ఓపెన్ స్కూలు ద్వారా ఎస్ఎస్‌సీలో ఉత్తీర్ణులైన వారితోపాటు పాఠశాలల్లో ఎస్ఎస్‌సీ పూర్తి చేసి వివిధ కారణాల వల్ల ఇంటర్మీడియెట్ చదవలేక పోయినవారికి, ఇంటర్ ఫెయిలై చదువు మానేసిన వారికి సార్వత్రిక విద్యావిధానంలో ఇంటర్మీడియెట్ కోర్సును ప్రభుత్వం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, డీఆర్వో శ్రీనివాసమూర్తి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, డీఈవో చంద్రకళ, ఆర్ఐవో సత్యనారాయణ పాల్గొన్నారు.

ఫౌండేషన్ సీడ్‌తో మంచి విత్తనాల ఉత్పత్తి


రైతులకు శిక్షణ ఇస్తున్న వ్యవసాయాధికారి

చోడవరం రూరల్/దేవరాపల్లి: ప్రభుత్వం అందించిన ఫౌండేషన్ విత్తనాన్ని సరైన యాజమాన్య పద్ధతుల్లో సాగు చేయడం ద్వారా మంచి సర్టిఫైడ్ విత్తనాలను ఉత్పత్తి చేయవచ్చని అనకాపల్లి జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి వి.తులసీమణి తెలిపారు. సోమవారం చోడవరం మండలంలోని ఖండేపల్లి, దేవరాపల్లిలోని బోయిలకింతాడ, వేచలం గ్రామాల్లో జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో గ్రామీణ విత్తనోత్పత్తిపై రైతులకు శిక్షణ ఇచ్చారు. సొంతంగా విత్తనాలు తయారు చేసుకుంటే ప్రైవేట్ వ్యాపారుల చేతిలో మోసపోయే పరిస్థితి ఉండదన్నారు. ఖరీఫ్ వరి నాట్లు వేసే రైతులు నారు చివర్లను తుంచి నాట్లు వేసుకుంటే, పురుగుల బెడద తగ్గుతుందన్నారు. కాలి బాటలు వదిలితే పంటకు దోమపోటు, తెగుళ్లు సోకకుండా నివారించవచ్చన్నారు. శిక్షణలో సర్పంచ్ శానాపతి రాజశేఖర్, మండల వ్యవసాయ అధికారు ఇ.పావని, వై.కాంతమ్మ, జిల్లా వనరుల కేంద్రం ఏఈవో ఎస్.సాయివాణి, మండల వ్యవసాయ విస్తరణాధికారి ఎస్.కిరణ్ కుమార్, గ్రామ వ్యవసాయ సహాయకులు డి.ప్రీతి కావేరి, బి.కిరణ్, గ్రామీణ విత్తనోత్పత్తి పథకం లబ్ధిదారు రైతులు పాల్గొన్నారు.

షూటింగ్ వాహనాలతో రహదారి ధ్వంసం


ధ్వంసమైన కుండాడ- జీఎం వలస రహదారి

మారేడుమిల్లి: సినిమా షూటింగ్ వాహనాల వల్ల మండలంలోని కుండాడ, జీయంవలన గ్రామాల రహదారి ధ్వంసమైనట్టు కుండాడ సర్పంచ్ కుండ్ల ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలోని ఓ సినిమా షూటింగ్ జరుగుతుందని, కుండాడ, జీఎం వలస రహదారిలోని అడవి ప్రాంతంలో సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. దీంతో ఈ రహదారి మీదుగా షూటింగ్‌కు సంబంధించిన భారీ వాహనాలు తిరుగుతున్నాయని, ఫలితంగా రోడ్డు పాడైపోతుందన్నారు. ఇటీవల మూడు నెలలు క్రితం రెండున్నర కోట్ల వ్యయంతో నూతనంగా ఏడు కిలోమీటర్ల మేర తారు రోడ్డు నిర్మించారని తెలిపారు. వాహనాల వల్ల అప్పుడే రోడ్డు పాడైపోయిందన్నారు. షూటింగ్ వారిని ప్రశ్నించగా ఇష్టానుసరంగా మాట్లాడుతున్నారని అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని సర్పంచ్ కోరారు.

గుండెపోటును గుర్తించేలా...

- ఏపీ స్టెమీ ప్రాజెక్టు శిక్షణ కార్యక్రమం ప్రారంభం


ప్రసంగిస్తున్న కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున

మహారాణిపేట : కోవిడ్ తర్వాత వైద్య రంగంలో వివిధ దురదృష్టకర సంఘటనలు జరుగుతున్నాయని, ముఖ్యంగా యువకులు గుండెపోటుకు అధికంగా గురవుతున్నారని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున పేర్కొన్నారు. ఇందుకు కచ్చితమైన కారణాలు కనుగొనడం కష్టంగా మారిందన్నారు. ఇందుకోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్టెమీ ప్రాజెక్టు శిక్షణ కార్యక్రమం ప్రారంభించిందన్నారు. సోమవారం కేజీహెచ్‌లో జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈనెల 19వ తేదీ వరకు పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో వైద్యులు, నర్సులు, పారా మెడికల్ సిబ్బందికి ఈ శిక్షణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఆస్పత్రులకు దూరంగా ఉన్న రోగుల్లో గుండెపోటు కారణంగా మరణాలను నివారించడానికి ఏపీ ప్రభుత్వం ఈ స్టెమీ ప్రాజెక్టును ప్రారంభించిందన్నారు. సుదూర ప్రాంతాల్లో, గ్రామీణ సెమీ అర్బన్ ప్రాంతాల్లో ప్రజలకు 'ఈసీజీ' చేయడం ద్వారా గుండెపోటును గుర్తించడానికి వైద్యులు శిక్షణ పొందుతారని, సమాచారాన్ని కార్డియాలజిస్టులకు పంపడం ద్వారా చికిత్సను సూచిస్తారని తెలిపారు. ఆ తర్వాత సీహెచ్‌సీ, పీహెచ్‌సీ వైద్యులు గుండె రక్తనాళాల్లో క్లాట్ కరిగించే మందులు ఇంట్రావీనస్ ద్వారా ఇస్తారని, అడ్డంకులు తొలగిపోయి ఛాతి నొప్పి తగ్గుతుందన్నారు. అనంతరం వారు రోగులను కేజీహెచ్ కార్డియాలజీ విభాగానికి పంపిస్తారన్నారు. కేజీహెచ్‌లోని కార్డియాలజీ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంటు ప్రొఫెసర్లు, కార్డియాలజీ విభాగం, ఏఎంసీ ద్వారా ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి ఈ ప్రాజెక్టు పనులు ప్రారంభం అవుతాయన్నారు. ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education
శ్రీనివాస బిస్నెస్ ఎడ్యుకేషన్ 100% పాస్ గ్యారంటీ ISO 9001:2015 Certified. APOSS ద్వారా 10th, Inter, నాగార్జున, ఆంధ్రా యూనివర్శిటీ ద్వారా BA, B.Com, B.Sc, MA, M.Com, M.Sc. ✆ 99493 08940 [B-319]

Real Estate
PLOT FOR SALE
గాజువాకకు 16 కి.మీ., దేశపాత్రునిపాలెంకు 3 కి.మీ. దూరంలో Sq. 2,600/-, రావాడ పామ్ ల్యాండ్ Sq. 2,200/- కలవు, వుడా Rs. 3,500/- రెడ్‌శాండిల్ Sq., AKP. ఫోన్: 91542 33332 [V- 791071]
GVMC పరిధి-100 గజాలు 3 లక్షలు ఏభైవేలు, వెంటనే ఇల్లు కట్టుకొనేల 150, 200 గజాల బిట్లు కలవు, EMI సదుపాయం కలదు. ఫోన్: 70936 32399, 73864 14017 [V- 794476]

Services
GOLD LOANS
లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 10745]
బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్. ✆ 76508 91999 [B-781999]

BUSINESS OFFER
Learn & Earn in Currency Trading Master one Pair one Strategy one Trade Every day. Contact : 8591712181. [WB-20553]

SEPTIC TANK CLEAN
సుధాకర్ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్స్ హైటెక్ మిషన్‌తో అతితక్కువ ఖర్చుతో ఇరుగుపొరుగు వారికి ఎటువంటి దుర్వాసన లేకుండా 10 ని॥ల్లో క్లీన్ చేయబడును. ఫోన్: 98488 06516, 90149 03518 [V-2073]

Wanted
ప్రముఖ సంస్థకు మాయొక్క మొబైల్ ద్వారా సమాచారం పంపుతూ వారం వారం అధిక ఆదాయం సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సప్ చేయండి. 9676414393. [M-1221480]
Walk-in-Interview : 08-08-23, 11:00 am to 5 pm, 1) Accountant 2) computer Operator 3) Managers 4) House Keeping. Ct : Royal Palace, Rly Station Road. Ph : 92810 91869 [V-2944]
కొత్తగా ప్రారంభించిన ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌కి నూడిల్స్, ఫ్రైడ్‌రైస్ తయారు చేయుటకు మాస్టర్ కావలెను. డాబాగార్డెన్స్ దగ్గర. ఫోన్: 99128 73614 [V- 2636]
మీరు ఉన్న చోటు నుండి డిజిటల్‌గా వర్క్ చేస్తూ ప్రముఖ గ్లోబల్ కంపెనీలో నెలకు 35,000/- వరకు సంపాదించవచ్చు. (పార్ట్ / ఫుల్‌టైం) 100% ఎటువంటి ఫీజులు లేవు. సంప్ర : 97015 05819 [V- 797255]
ఉద్యోగ అవకాశం : ప్రముఖ అగ్రగామి ISO సంస్థలో పనిచేయుటకు సిబ్బంది కావలెను. అసిస్టెంట్ జనరల్ మేనేజర్స్-10, బ్రాంచ్ డవలప్‌మెంట్ మేనేజర్స్-10, Govt / Pvt పదవీ విరమణ చేసినవారు / మార్కెటింగ్ / ఇన్సూరెన్స్ రంగాల్లో అనుభవం గలవారు వయస్సు 35 సం॥పై బడిన వారు అర్హులు. ఆదాయం, ఇన్సెంటివ్స్ ఇంటర్వ్యూలో నిర్ణయించబడును. ఇంటర్వ్యూ ఈ రోజు, రేపు. ఫోన్: 99854 61280, 73311 11287 [V-641]
1) దువ్వాడలో పనిచేయుటకు M/F సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. డ్యూటీ 8 గం॥, శాలరీ 15,600/-. 2) అనకాపల్లిలో పనిచేయుటకు కంప్యూటర్ నాలెడ్జ్ గల సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. శాలరీ : 12,000/-, రూం ఫ్రీ. ఫోన్: 91001 03011, 93099 87957 [V-2069]
మీ మొబైల్ ద్వారా మా కంపెనీ అడ్వర్టైజ్‌మెంట్ పంపుతూ వారం వారం అధిక ఆదాయం పొందండి. మీ అడ్రస్ వాట్సప్ చేయండి. వివరాలకు కాల్ చేయండి. 95736 33520, 90596 33520. [M-1221507]
హరేకృష్ణ హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ కావలెను. ఫ్రీవసతి + భోజనం. జీ:18k హైదరాబాద్ 9640258899, విజయవాడ: 9640648899. [HA-476]
షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీవార్డెన్స్, ఆయాలు, వార్డ్ బాయ్స్, భార్యాభర్తలు కావలెను. ఫోన్: 9391036931, 9246585901 [HA-11729]
అనకాపల్లి, నర్సీపట్నం, తుని, చింతపల్లి, పెందుర్తి, గాజువాక, విజయనగరం మొ॥ ఇతర జిల్లాల్లోని అన్ని మండలాల్లో స్కూల్స్ మండల కో-ఆర్డినేటర్స్ కావలెను. అ: ఇంటర్, జీ: 28k. 7993680951 [G-872]

తాజా వార్తల కోసం లాగాన్ అవ్వండి www.sakshi.com

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రకటన గోరంత! స్పందన కొండంత!! సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.
అద్దెకు, అమ్మకం, రియల్ ఎస్టేట్, ఫర్నీచర్స్, ఆటోమొబైల్స్, కంప్యూటర్స్, సర్వీసెస్, కావలెను
మీ ప్రాంతంలోని మా ప్రతినిధులను సంప్రదించండి
అనకాపల్లి :9010546644
యలమంచిలి :9951602901
చోడవరం :9010210265
నర్సీపట్నం :9010234557
పాడేరు :9010973030
విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం